అసలోళ్లెవరో తేల్చే ఎన్నిక

- తేలిపోనున్న ఎన్సీపీ, శివసేన భవితవ్యం
- ఉద్ధవ్, శరద్ పవార్‌కు జీవన్మరణ సమస్య
- ఏక్‌నాథ్‌షిండే, అజిత్ పవార్‌కు అగ్ని పరీక్ష
- ఇరువర్గాలకు కీలకంగా లోక్‌సభ ఎన్నికలు
- రెండు పార్టీలకు అసలైన వారసులెవరో తేల్చేయనున్న మహారాష్ట్ర ప్రజలు

ముంబై, ఏప్రిల్ 7: మహారాష్ట్రలో ఈ లోక్‌సభ ఎన్నికలు రెండు ప్రధాన పార్టీల భవితవ్యాన్ని తేల్చబోతున్నాయి. దశాబ్దాలుగా మరాఠా నేలపై ప్రభావాన్ని చూపిన శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)లకు అసలైన వారసులెవరో ప్రజాక్షేత్రంలో తీర్పు రానున్నది. మాజీ ముఖ్యమంత్రులు ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌కు ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. రెండు పార్టీలను చీల్చి బీజేపీతో జతకట్టిన ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్.. ప్రజామద్దతు తమకే ఉందని నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష పెడుతున్నాయి. కోర్టు తీర్పులు, స్పీకర్ నిర్ణయాలు, ఎన్నికల సంఘం ఆదేశాలు ఎలా ఉన్నప్పటికీ.. శివసేనకు అసలు వారసుడు ఉద్ధవ్ ఠాక్రేనా? ఏక్‌నాథ్ షిండేనా ? ఎన్సీపీకి ఇప్పటికీ నాయకుడు శరద్ పవారేనా? అజిత్ పవారా? అనేది ప్రజలు తేల్చబోతున్నారు. వచ్చే ఏడాది జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఈ లోక్‌సభ ఫలితాల ప్రభావం ఉండనున్నది.

ఉద్ధవ్ వర్సెస్ షిండే

ఆరు దశాబ్దాల క్రితం బాల్ ఠాక్రే స్థాపించిన శివసేన పార్టీ అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచినప్పటికీ 2022లో ఏకంగా పార్టీనే చీలిపోయింది. బాల్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే నుంచి శివసేన పార్టీని, జెండాను, గుర్తును, ముఖ్యమంత్రి పదవిని ఏక్‌నాథ్ షిండే లాక్కున్నారు. తామే బాల్ ఠాక్రే సిద్ధాంతాలకు వారసులమని, తమదే అసలైన శివసేన అని ఇటు ఉద్ధవ్, అటు ఏక్‌నాథ్ షిండే చెప్పుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు ప్రజలు ఈ విషయంలో ఒక తీర్పు ఇవ్వనున్నారు. అందుకే, ఇద్దరూ లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలిచే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్, ఎన్సీపీ(శరద్ పవార్)తో కలిసి బరిలో దిగుతున్న శివసేన(ఉద్ధవ్ వర్గం) 19 - 21 సీట్లలో పోటీ చేయనుంది. బీజేపీ, ఎన్సీపీ(అజిత్ పవార్) పొత్తుతో కలిసి శివసేన(ఏక్‌నాథ్ వర్గం) 12 - 14 స్థానాల్లో పోటీ చేయనున్నది. పోటీ చేస్తున్న సీట్లలో ఎక్కువ సీట్లు గెలుచుకోవడం ద్వారా పట్టు నిలుపుకోవాలని ఉద్ధవ్, ఏక్‌నాథ్ భావిస్తున్నారు. ముఖ్యంగా ముంబై, పుణె నగరాల్లో తమ బలాన్ని చాటుకోవాలని ఇరువురూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ఎన్సీపీ భవిష్యత్తు నిర్ణయించనున్న 'బారామతి'

ఐదు దశాబ్దాలుగా మహారాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న శరద్ పవార్‌కు 83 ఏండ్ల వయసులో అసలైన రాజకీయ పరీక్ష ఈ లోక్‌సభ ఎన్నికల ద్వారా ఎదురవుతున్నది. తన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ ఎన్సీపీని చీల్చి అసలైన ఎన్సీపీ తనదేనని చెప్పుకుంటున్నారు. దీంతో ఈ ఎన్నికల్లో తన బలాన్ని చాటుకోవాల్సిన అవసరం శరద్ పవార్‌కు ఏర్పడింది. ఎన్సీపీ తనదేనని ప్రజల్లోనే నిరూపించుకోవాలని అజిత్ పవార్ భావిస్తున్నారు. శివసేన(ఉద్ధవ్), కాంగ్రెస్‌తో పొత్తుతో ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) 9 - 10 స్థానాల్లో పోటీ చేయనున్నది. శివసేన(ఏక్‌నాథ్), బీజేపీతో జట్టుకట్టిన ఎన్సీపీ(అజిత్ పవార్ వర్గం) 5 స్థానాల్లో పోటీ చేయబోతున్నది. ముఖ్యంగా శరద్ పవార్ కంచుకోట అయిన బారామతి స్థానంలో ఇప్పుడు అసలైన ఎన్సీపీ ఎవరిదో తేల్చేయనున్నది. ఇక్కడ శరద్ పవార్ ఆరు సార్లు, ఆయన కూతురు సుప్రియా సూలే మూడుసార్లు గెలిచారు. మరోసారి తన కూతురు సుప్రియా సూలేను శరద్ పవార్ బరిలో నిలిపారు. అజిత్ పవార్ తన సతీమణి సునేత్రను పోటీ చేయిస్తున్నారు. ప్రత్యక్షంగా సుప్రియా, సునేత్ర మధ్య పోటీనే అయినప్పటికీ పరోక్షంగా ఇది శరద్ పవార్, అజిత్ పవార్ మధ్య పోరు. కంచుకోటలోనే ఓడించడం ద్వారా శరద్ పవార్ రాజకీయ జీవితానికి చెక్ పెట్టాలని అజిత్ పవార్‌తో పాటు బీజేపీ కూడా భావిస్తున్నది.



గుర్తులతోనే అసలు సమస్య

పార్టీల్లో చీలికల ద్వారా రాజకీయ ఎదురుదెబ్బలు తిన్న ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌కు ఎన్నికల గుర్తులు ఇప్పుడు ప్రధాన సమస్యగా మారాయి. శివసేన గుర్తు అయిన విల్లు, బాణం శివసేన(ఏక్‌నాథ్ షిండే)కు ఎన్నికల సంఘం కేటాయించింది. శివసేన(ఉద్ధవ్)కు కొత్తగా 'మండుతున్న జ్యోతి' గుర్తును ఇచ్చింది. ఎన్సీపీ గుర్తు అయిన గడియారం ఇప్పుడు ఎన్సీపీ(అజిత్ పవార్)కు వెళ్లింది. ఎన్సీపీ(శరద్ పవార్)కు కొత్తగా 'బాకా ఊదుతున్న మనిషి' గుర్తును ఈసీ కేటాయించింది. అనేక ఎన్నికల ద్వారా ప్రజల్లోకి వెళ్లిన గుర్తులు ఇప్పుడు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌కు వెళ్లడం వారికి కలిసి వచ్చే అవకాశం ఉంది. కొత్త గుర్తులను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఉద్ధవ్, శరద్ పవార్‌కు సవాల్‌గా మారింది.

బీజేపీలో చేరతారా లేక చర్యలు తీసుకోవాలా?

కేంద్రఏజెన్సీలు బెదిరిస్తున్నాయన్న మమత

పురూలియా: బీజేపీలో చేరతారా లేక చర్యలు తీసుకోవాలా అని కేంద్ర దర్యాప్తు సంస్థలు తమ పార్టీ నేతలను బెదిరిస్తున్నాయని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఆదివారం పురూలియా జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'టీఎంసీ నాయకులను వేధించడానికి ఎన్ఐఏ, ఈడీ, సీబీఐలను ఉపయోగిస్తున్నారు. అర్ధరాత్రి ఎవరైనా ఇంట్లోకి చొరబడితే ఇంట్లోని మహిళ ఏం చేస్తుంది?' అని ఆమె ప్రశ్నించారు. భూపతినగర్‌లో ఎన్ఐఏ అధికారులపై జరిగిన దాడిని ఇందుకు ఉదాహరణగా ఆమె అభివర్ణించారు.

బెంగాల్‌లో ఎన్ఐఏ అధికారులపై కేసు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారుల సోదాలు రాజకీయంగా అలజడిని సృష్టించాయి. టీఎంసీ నాయకుడు మనోబ్రత జనా భార్య ఫిర్యాదు ఆధారంగా ఎన్ఐఏ అధికారులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సోదాల పేరుతో ఎన్ఐఏ అధికారులు శనివారం అర్ధ రాత్రి తన ఇంట్లో చొరబడ్డారని, తన గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించారని మనోబ్రత జనా భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

నక్సల్ ప్రభావిత సింగ్‌భూమ్‌లో తొలిసారి ఓటింగ్!

రాంచి : జార్ఖండ్‌లోని సింగ్‌భూమ్ లోక్‌సభ స్థానం పరిధిలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తొలిసారి ఓటింగ్ జరగనుంది. దశాబ్దాల విరామం తర్వాత ఆసియాలోని అత్యంత దట్టమైన సాల్ అటవీ ప్రాంతంలోని సరండాలో నివసించే ప్రజలు ఓటుహక్కు వినియోగించుకునేలా పోలింగ్ సిబ్బందిని, సామగ్రిని హెలికాప్టర్ల ద్వారా తరలించనున్నారు. ఇక్కడ 118 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేస్తారు. రెండు దశాబ్దాల తర్వాత పోలింగ్ నిర్వహించాల్సిన ప్రాంతాలను గుర్తించామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

ఆజాద్ వర్సెస్ ముఫ్తీ

అనంతనాగ్‌లో రసవత్తర పోటీ

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో రసవత్తరమైన పోటీకి తెరలేచింది. లోక్‌సభ బరిలో ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు నేరుగా తలపడనున్నారు. అనంతనాగ్-రాజౌరీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ, డీపీఏపీ అధ్యక్షుడు గులాం నబీ ఆజాద్ బరిలో దిగుతున్నారు. ఇక ఇండియా కూటమి తరపున నేషనల్ కాన్ఫరెన్స్ నేత మియాన్ అల్తాఫ్ అహ్మద్ పోటీ పడుతున్నారు. అనంత్‌నాగ్‌లోని బిజ్‌బెహరాకు చెందిన ముఫ్తీ తాను పోటీ చేసే స్థానాన్ని ఆదివారం ప్రకటించారు. గతంలోనూ ఇక్కడ పోటీ చేసి మూడో స్థానంలో నిలిచిన ఆమె తన ప్రాబల్యాన్ని నిరూపించుకోవడానికి మరోసారి బరిలో దిగుతున్నారు. ఇక 2022లో కాంగ్రెస్‌ను వీడి కొత్త పార్టీ స్థాపించిన గులాం నబీ ఆజాద్ ప్రధాన పోటీదారుగా బరిలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఈ స్థానం నుంచి నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన జస్టిస్ హస్నైన్ మసూది గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి రెండు, ముఫ్తీ మూడో స్థానంలో నిలిచారు. పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ ఇటీవల వరకు ఇండియా కూటమి భాగస్వామిలో ఉన్నప్పటికీ నేషనల్ కాన్ఫరెన్స్ తన అభ్యర్థులను ప్రకటించడంతో పొత్తు విచ్ఛిన్నమైంది.

ఆమెపై దూషణలు

ఎన్నికల వేళ మహిళా నేతలపై అనుచిత వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: లోక్‌సభ ఎన్నికలు సమీపించిన వేళ మహిళా నేతలపై వ్యక్తిగత దూషణలు మరోసారి పెరిగాయి. ప్రత్యర్థులుగా నిలుస్తున్న మహిళా అభ్యర్థులను లక్ష్యంగా చేసుకొని సభ్యత మరిచి విమర్శిస్తున్నారు నాయకులు. అన్ని పార్టీల్లోనూ ఇలా నోటి దురుసు ప్రవర్తించే నేతలు కనిపిస్తున్నారు. నటి, ఎంపీ హేమమాలిని ఉద్దేశించి కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సుర్జేవాలా ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. గతంలో రోడ్ల గురించి చెప్తూ హేమమాలినిపై లాలూప్రసాద్ యాదవ్ చేసిన అసందర్భ వ్యాఖ్యలు కూడా దుమారం రేపిన సంగతి తెలిసిందే. బీజేపీ నాయకురాలు, నటి కంగనా రనౌత్‌ను ఉద్దేశించి కాంగ్రెస్ నేతలు హెచ్‌ఎస్ అహిర్, సుప్రియా శ్రీనేత్ చేసిన వ్యాఖ్యలపై కూడా విమర్శలు వచ్చాయి.

పెద్ద నాయకురాళ్లకూ తప్పలేదు

సోనియా గాంధీ, మాయావతి, మమతా బెనర్జీ, స్మృతి ఇరానీ, జయప్రద, ప్రియాంక గాంధీ వంటి మహిళా నేతలకు కూడా వ్యక్తిగత దూషణలు తప్పలేదు. గత ఎన్నికల్లో రాంపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన జయప్రదను ఉద్దేశించి సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజంఖాన్ చేసిన వ్యాఖ్యలు ఈ దూషణల పర్వానికి పరాకాష్టగా నిలిచాయి. కేవలం ప్రత్యర్థులే కాకుండా సొంత పార్టీల్లోని పురుష నాయకుల నుంచి మహిళా నేతలు ఇలాంటివి ఎదుర్కొంటున్నారని మహిళా హక్కుల కార్యకర్త రంజనా కుమారి తెలిపారు.

బీజేపీ కనీసం 200 సీట్లూ గెలవలేదు

ఆరెస్సెస్ సర్వేను ఉటంకించిన కర్ణాటక మంత్రి

బెంగళూరు, ఏప్రిల్ 7: ఆరెస్సెస్ అంతర్గత సర్వే ప్రకారం ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కనీసం 200 స్థానాలైనా గెలవలేదని కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. శనివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. ఆరెస్సెస్ సర్వే ప్రకారం కర్ణాటకలో కమలం పార్టీ కనీసం ఎనిమిది సీట్లైనా గెలవలేదన్నారు. బీజేపీని ప్రశ్నించాలని ఆ పార్టీ నాయకులే మాట్లాడుతున్నారని ఖర్గే అన్నారు. 'ఒక కుటుంబం వల్ల రాష్ట్రంలో పార్టీ కలుషితమైందని వాళ్లే చెప్తున్నారు. అసలైన బీజేపీని తిరిగి స్థాపించాలని వారు కోరుతున్నారు. బసనగౌడ్ పాటిల్, సీటీ రవి, అనంత్‌కుమార్ హెగ్డే, ఈశ్వరప్ప లాంటి హిందుత్వ నాయకులకు అన్యాయం జరిగిందని ఆ పార్టీ నేతలే అంటున్నారు. వాళ్లలో వాళ్లే కొట్లాడుకుంటున్నారు. మేమేం చేయలేదు' అని ఖర్గే చెప్పారు.

ఈసారి ఎన్డీయేకు '4,000' లోక్‌సభ సీట్లు

బిహార్ సీఎం నితీశ్ కుమార్ వ్యాఖ్యలు

నవాదా, ఏప్రిల్ 7: బీహార్‌లోని నవాదాలో ఆదివారం జరిగిన ఎన్నికల సభలో రాష్ట్ర సీఎం, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ తడబాటు వ్యాఖ్యలు చేశారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి '4,000'కు పైగా సీట్లు గెలుచుకుంటుందంటూ వ్యాఖ్యానించడం వైరల్‌గా మారింది. తన ప్రసంగంలో మొదటగా 'నాలుగు లక్షల'ంటూ తడబడిన నితీశ్.. ఆ తర్వాత సరిదిద్దుకొని మళ్లీ '4,000'కు పైగా సీట్లు అని పేర్కొనడం గమనార్హం. దీనిపై నితీశ్ కుమార్‌ను సోషల్ మీడియాలో నెటిజన్లు ట్రోల్ చేస్తుండగా.. లోక్‌సభలో ఎంత మంది ఎంపీలు ఉంటారో కూడా ఎన్డీయే కూటమికి తెలియదని, బీజేపీ నేతల ముఖాల్లో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తున్నదని విపక్ష ఆర్జేడీ ఎద్దేవా చేసింది.

224 ముక్కలుగా నరికి నదిలో విసిరేశాడు!

లండన్: ఇంగ్లండ్‌లో ఓ యువకుడు అత్యంత దారుణ హత్యకు పాల్పడ్డాడు. లింకన్‌షైర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాది మార్చి 24న ఈ హత్య జరిగింది. నేరాన్ని అంగీకరించిన నిందితుడు నికోలస్ మెట్సన్(28)కు కోర్టు సోమవారం శిక్ష ఖరారు చేయనుంది. హోలీ బ్రామ్లి(26)ని నికోలస్ 2021లో వివాహం చేసుకున్నాడు. విడిపోయే దశలో ఉండగా.. ఆమెను కత్తితో పొడిచి చంపి శరీర భాగాల్ని 224 ముక్కలు చేసి.. ప్లాస్టిక్ బ్యాగులో వేసి ఇంట్లో కోల్డ్ స్టోరేజ్‌లో వారం పాటు ఉంచాడు. స్నేహితుడికి 50 డాలర్లు ఇచ్చి.. ఆ ప్లాస్టిక్ బ్యాగుల్ని విథమ్ నదిలో పడేయించాడు.

29 గంటలపాటు చిత్రహింసలు!

న్యూఢిల్లీ: ఫిబ్రవరిలో కేరళలో సంచలనం రేపిన వెటర్నరీ విద్యార్థి సిద్ధార్థన్(20) ఆత్మహత్యకు ర్యాగింగే అసలు కారణమని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక పేర్కొంది. శుక్రవారం సీబీఐ ఈ కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వయనాడ్ జిల్లాలోని ఓ పశువైద్య కళాశాల వసతి గృహంలో ఉంటున్న సిద్ధార్థన్‌ను 29 గంటలపాటు తోటి విద్యార్థులు శారీరకంగా, మానసికంగా వేధించారు. దీంతో అతడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఫిబ్రవరి 18న ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

నడ్డాను విచారించరా?

- బీజేపీకి విరాళం ఇచ్చిన తర్వాతే శరత్ చంద్రారెడ్డికి బెయిల్
- మద్యం కేసులో ఆప్ నేతల వద్ద రూపాయైనా దొరికిందా?
- కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఢిల్లీ మంత్రి అతిశీ ప్రశ్నల వర్షం
- మద్యం పాలసీ కేసు ఓ కట్టుకథ అని కొట్టిపారేసిన ఆప్ నేత
- కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆప్ దేశవ్యాప్త నిరాహార దీక్షలు

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆదివారం జరిగిన నిరాహార దీక్షలో కేజ్రీవాల్‌కు మద్దతుగా నినదిస్తున్న ఆప్ నేత అతిశీ తదితరులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: ఢిల్లీ మద్యం పాలసీ కేసు ఓ కట్టుకథ అని ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నేత అతిశీ కొట్టిపారేశారు. ఈ కేసు విచారణ చేస్తున్న దర్యాప్తు సంస్థలపై ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. కేజ్రీవాల్ లేదా ఇతర ఆప్ నేతల వద్ద ఒక్క రూపాయి అయినా దొరికిందా? అని ప్రశ్నించారు. మద్యం పాలసీ కేసులో నిందితుడిగా ఉన్న శరత్ చంద్రారెడ్డి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి విరాళాలు ఇచ్చాడని, దీనిపై ఈడీ, సీబీఐ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాపై ఎందుకు విచారణ చేపట్టలేదని నిలదీశారు. కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఆప్ ఆదివారం దేశవ్యాప్తంగా ఒక్కరోజు నిరాహార దీక్షలు చేపట్టింది. ఈ సందర్భంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన దీక్షలో అతిశీ మాట్లాడుతూ కేంద్ర దర్యాప్తు సంస్థల తీరును ఎండగట్టారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని మద్యం వ్యాపారి శరత్ చంద్రారెడ్డిపై ఒత్తిడి తెచ్చి, అప్రూవర్‌గా మార్చుకొన్నారని ఆరోపించారు. ఓవైపు మద్యం పాలసీ కేసులో శరత్ చంద్రారెడ్డి కీలక వ్యక్తి అని ఈడీ, సీబీఐ చెప్పాయని, అయితే బీజేపీకి విరాళం ఇచ్చిన తర్వాతనే ఆయనకు బెయిల్ వచ్చిందని అతిశీ గుర్తు చేశారు. ఒక్క రూపాయి దొరక్కపోయినా కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని, మరి నిందితుడి నుంచి విరాళాలు తీసుకొన్న బీజేపీ అధ్యక్షుడు నడ్డాను ఎందుకు అరెస్టు చేయడం లేదని అతిశీ సూటిగా ప్రశ్నించారు. దేశంలోని ప్రతి పక్ష నేతలపైనే కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు జరుగుతున్నాయని, ఒక్క బీజేపీ నాయకుడిపై కూడా ఎందుకు దాడులు జరుగడం లేదని అతిశీ నిలదీశారు. అవినీతి ఆరోపణలు ఉన్న నేతలు బీజేపీలో చేరితే సచ్ఛీలురు అయిపోతారంటూ ఎద్దేవా చేశారు.

బెదిరించి స్టేట్‌మెంట్లు..

దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాల్లో నిరాహారదీక్షలు చేపట్టినట్టు ఆప్ తెలిపింది. అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లోనూ కేజ్రీవాల్ మద్దతుదారులు దీక్షలు చేశారని పేర్కొన్నది. స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ స్వగ్రామంలో పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ దీక్షకు కూర్చొన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలో అతిశీతో పాటు పలువురు ఇతర మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ రామ్ నివాస్ గోయెల్, ఆప్ నేతలు పాల్గొన్నారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ శరత్‌చంద్రా రెడ్డి, మాగుంట రాఘవరెడ్డిలను బెదిరించి, బలవంతం చేసి కేజ్రీవాల్ పేరు చెప్పించారని ఆరోపించారు. ఆ తర్వాత వారిద్దరికీ బెయిల్ వచ్చిందని తెలిపారు. గత 20 ఏండ్లుగా అనారోగ్య సమస్యలు ఉన్న మనీశ్ సిసోడియాకు బెయిల్ రాలేదని, కానీ శరత్‌చంద్రారెడ్డికి మాత్రం వెన్నునొప్పి కారణంతో బెయిల్ ఇచ్చారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, బీజేపీకి వ్యతిరేకంగా ప్రజలందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని సంజయ్ సింగ్ పిలుపునిచ్చారు.

బెంగళూరులో కలరా కలకలం

- ఇద్దరు మెడికోలకు పాజిటివ్
- అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం

బెంగళూరు, ఏప్రిల్ 7: కర్ణాటకలో మళ్లీ కలరా కలకలం రేగింది. బెంగళూరు మెడికల్ కాలేజ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు(బీఎంసీఆర్ఐ) చెందిన ఇద్దరు విద్యార్థులకు కలరా పాజిటివ్ తేలిందని అధికారులు ఆదివారం వెల్లడించారు. డయేరియా, డీహైడ్రేషన్ వంటి కారణాలతో దవాఖానలో చేరిన 47 మంది విద్యార్థుల్లో వీరిద్దరు ఉన్నారు. దీంతో రాష్ట్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. ఇతరులకు కలరా వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించింది. బీఎంసీఆర్ఐ హాస్టల్ కిచెన్‌ను మూసివేసి, డిస్‌ఇన్‌ఫెక్షన్ చర్యలు చేపట్టారు. పెస్ట్ కంట్రోల్ చర్యలు కూడా తీసుకొంటున్నట్టు అధికారులు వెల్లడించారు. కాగా, ఈ ఏడాది రాష్ట్రంలో ఆరు కలరా కేసులు నమోదయ్యాయని, వాటిలో ఐదు ఒక్క మార్చి నెలలోనే రిపోర్టు అయ్యాయని కర్ణాటక ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం పేర్కొన్నది.

ఆగని మారణహోమం

హమాస్-ఇజ్రాయెల్ యుద్ధానికి ఆరు నెలలు

జెరూసలేం, ఏప్రిల్ 7: అది 2023, అక్టోబర్ 7.. ఇజ్రాయెల్ భూభాగంపైకి గాజా స్ట్రిప్ నుంచి ఒక్కసారిగా వందలాది రాకెట్లు దూసుకొచ్చాయి. అకస్మాత్తు దాడితో హమాస్ మిలిటెంట్లు దక్షిణ ఇజ్రాయెల్‌లో విధ్వంసం సృష్టించారు. ఊహించని దాడి నుంచి తేరుకొన్న ఇజ్రాయెల్ వెంటనే ప్రతిదాడికి దిగింది. గాజా స్ట్రిప్‌పై మొదటగా రాకెట్లతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్.. ఆ తర్వాత హమాస్‌ను పూర్తిగా మట్టుపెట్టే లక్ష్యంతో ఏకంగా గాజా భూభాగంలోకి వెళ్లి దాడులను ముమ్మరం చేసింది. హమాస్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధానికి ఆదివారంతో ఆరు నెలలు గడిచాయి. ఈ యుద్ధంలో ఇరువైపులా దాదాపు 35 వేల మంది మరణించగా.. వేల సంఖ్యలో గాయపడ్డారు. వేలాది భవనాలు, ఇండ్లు ధ్వంసం అయ్యాయి. ఇజ్రాయెల్ దాడులతో గాజావాసులు సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఉండేందుకు ఇండ్లు లేక, తినేందుకు తిండి దొరక్క అవస్థలు పడుతున్నారు.

గాజాలో మృతుల సంఖ్య
33,175

ఇజ్రాయెల్‌లో మరణాలు
1,170

హతమైన హమాస్ మిలిటెంట్లు
12,000

హమాస్ బందీలుగా తీసుకొన్నవారు
250

ఇంకా బందీలుగా ఉన్నవాళ్లు
129

మరణించిన ఇజ్రాయెల్ సైనికులు
600

ఇజ్రాయెల్‌పైకి గాజా నుంచి పేలిన రాకెట్లు
9,100

గాజాలో ఇజ్రాయెల్ ధ్వంసం చేసిన లక్ష్యాలు
32,000

'గాజాపై యుద్ధంలో విజయానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నాం. బందీలందరినీ హమాస్ వదిలిపెట్టే వరకు సంధి, కాల్పుల విరమణ ప్రసక్తే లేదు. డీల్ చేసుకొనేందుకు ఇజ్రాయెల్ సిద్ధంగా ఉంది కానీ, సరెండర్ అయ్యేందుకు కాదు! మా దేశంపై పలు దాడుల వెనుక ఇరాన్ ఉన్నది. మమ్మల్ని దెబ్బతీసినా, ఆ దిశగా ప్లాన్లు వేసినా.. మేం కూడా అదే రీతిలో స్పందిస్తాం. అన్నివేళలా ఇదే విధానాన్ని పాటిస్తాం.'

-బెంజమిన్ నెతన్యాహూ, ఇజ్రాయెల్ ప్రధాని

కర్ణాటకలో నోట్ల కట్టలు

సార్వత్రిక ఎన్నికల వేళ కర్ణాటకలో పోలీసులు భారీగా నగదు, బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బళ్లారి పట్టణంలో నరేశ్ అనే నగల షాపు యాజమాని ఇంట్లో పోలీసులు సోదాలు జరపగా.. రూ.5.60 కోట్ల నగదు, 3 కిలోల బంగారం, 103 కిలోల వెండి ఆభరణాలు, 68 వెండి కడ్డీలు లభ్యమయ్యాయి. నరేశ్‌ను పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారణ చేస్తున్నారు.

రక్తపరీక్షతో గుండెపోటును ముందే పసిగట్టొచ్చు!

లక్నో, ఏప్రిల్ 7: రక్త పరీక్షతో గుండెపోటు ముప్పును ముందుగానే పసిగట్టొచ్చని, అలాగే తలకు అయిన గాయం తీవ్రత ఎంతో కూడా గుర్తించవచ్చని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ పరిశోధకులు వెల్లడించారు. తద్వారా ఎమర్జెన్సీ రూమ్‌లో గడిపే సమయాన్ని తగ్గించవచ్చని వివరించారు. గుండెపోటు గుర్తింపునకు ఇప్పటికే ట్రోపోనిన్ I రక్త పరీక్ష వైద్యులకు అందుబాటులో ఉన్నదని తెలిపారు. ఈ పరీక్ష ద్వారా గుండెపోటును గుర్తించడంతో పాటు, భవిష్యత్తులో గుండెపోటు వచ్చే ముప్పును కూడా అంచనా వేయొచ్చని పేర్కొన్నారు.

జీన్స్‌తో పర్యావరణానికి హాని!

- *ఒక జత జీన్స్‌తో 2.5 కిలోల కార్బన్‌డయాక్సైడ్ ఉత్పత్తి*
- *ఇది కారులో 10 కిలోమీటర్లు ప్రయాణించటంతో సమానం*
- *చైనా వర్సిటీ అధ్యయనంలో వెల్లడి*

*బీజింగ్, ఏప్రిల్ 7: జీన్స్‌తో పర్యావరణానికి ఊహించనంత హాని కలుగుతున్నదని శాస్త్రవేత్తలు వెల్లడించారు. మారుతున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా జీన్స్ ఉత్పత్తి అవుతున్నది. దీని ప్రభావంతో కార్బన్ డయాక్సైడ్ భారీ స్థాయిలో వెలువడుతున్నదని పరిశోధకులు తెలిపారు. చైనాలోని గాంగ్‌డాంగ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు జీన్స్ వల్ల కలిగే పర్యావరణ కాలుష్యంపై పరిశోధనలు చేయగా.. ఒక జత జీన్స్ ధరించటం వల్ల 2.5 కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి అవుతున్నదని తేలింది. అంటే.. పెట్రోల్ కారులో ఒకసారి 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించటంతో సమానం అని వెల్లడించారు. సంప్రదాయ జీన్స్‌తో పోల్చితే ఫాస్ట్ ఫ్యాషన్ జీన్స్ (ట్రెండ్‌కు తగ్గట్టు తయారుచేసి మార్కెట్‌లోకి విడుదల చేసే జీన్స్) జీన్స్ నగటున 7సార్లు మాత్రమే ధరిస్తున్నారని, దాంతో అదనంగా 11 రెట్లు కాలుష్యం పెరుగుతున్నదని వివరించారు. ఒక రకంగా 95-99 శాతం ఎక్కువ కార్బన్‌డయాక్సైడ్ ఉత్పత్తి అవుతున్నదని స్పష్టం చేశారు. జీన్స్ వల్ల వెలువడే కార్బన్ డయాక్సైడ్‌లో 48 శాతం ఉత